10 శాతం రాయితీతో అద్దెకు ఆర్టీసీ బస్సులు

జీడిమెట్ల, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం సందర్భంగా వివాహాది శుభకార్యాలకు, విహారయాత్రలకు టీజీఆర్టీసీ ప్రవేశపెట్టిన స్కీంలో భాగంగా అతి తక్కువ ధరకే బస్సులు అద్దెకు ఇవ్వనున్నట్లు జీడిమెట్ల డిపో మేనేజర్ కె.ఆంజనేయులు శుక్రవారం ఒక ప్రకటలో తెలిపారు. అద్దెకు ఆర్డినరి, మెట్రో బస్సులు డిపాజిట్ లేకుండా ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈనెల 5వ తేదీ నుంచి సెప్టెంబర్ 3వ తేదీ వరకూ శ్రావణమాసం సందర్భంగా జీడిమెట్ల డిపోలో బస్సులు బుక్ చేసుకుంటే 10 శాతం రాయితీ లభిస్తుందని తెలిపారు. వివరాలకు డిపో మేనేజర్ - 99592 26150, అసిస్టెంట్ మేనేజర్ నీలమణి-73828 22588, సూపర్‌వైజర్ జెఎల్ బాలు - 83339 63572లలో గానీ, నేరుగా వచ్చి గానీ సంప్రదించొచ్చని తెలిపారు. జీడిమెట్ల, కుత్బుల్లాపూర్ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



ప్రతాప్‌కు మొక్కను అందజేస్తున్న నాయీబ్రాహ్మణ సంఘం సభ్యులు

ఐకమత్యంతో సంఘాన్ని అభివృద్ధి చేసుకోవాలి

పేట్‌బషీరాబాద్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): సంఘం సభ్యులు ఐకమత్యంగా ఉంటూ తమ సమస్యలను పరిష్కరించుకోవాలని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షుడు కేఎం.ప్రతాప్‌గౌడ్ అన్నారు. కుత్బుల్లాపూర్ శ్రీసాయి నాయీబ్రహ్మణ సేవాసంఘం వార్డు-1 నూతన కార్యవర్గసభ్యులు కుత్బుల్లాపూర్ గ్రామంలోని ఆయన నివాసంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ నూతన సంఘం సభ్యులు, నియోజకవర్గ అధ్యక్షుడు వెంకటేశం, చైర్మన్ నారాయణలు ఉన్నారు.

సింథటిక్ టెన్నిస్ గ్రౌండ్ ప్రారంభం

గచ్చిబౌలి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి సర్కిల్‌లోని లింగంపల్లిలోని లేగల స్పోర్ట్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన సింథటిక్ టెన్నిస్ గ్రౌండ్‌ను నిర్వాహకులు శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో వ్యవస్థాపకులు లేగల రమేష్‌రెడ్డి కుటుంబసభ్యులు, స్థానికులు మన్నే సతీష్, శేరిలింగంపల్లి బీజేపీ నాయకులు ఎల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇనార్బిట్‌లో 'మిడ్‌నైట్ షాపింగ్ ఫెస్టివల్'

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం రాత్రి 1 గంట వరకూ దుకాణాలు తెరుచుకునే అవకాశం కల్పించిన తరువాత అర్ధరాత్రి షాపింగ్, వినోద అనుభవాలను వినూత్నంగా అందించడానికేనంటూ సైబరాబాద్‌లోని ఇనార్బిట్ మాల్ మిడ్ నైట్ షాపింగ్ ఫెస్టివల్ నిర్వహిస్తోంది. మూడు రోజుల పాటు జరిగే ఈ ఫెస్టివల్ శుక్రవారం ప్రారంభమైంది. షాపింగ్‌తో పాటుగా వినోదం షాపర్లకు అందించే ప్రయత్నం చేస్తూ ఆగస్టు 9న స్టాండప్ కమెడియన్ రోహిత్ స్వైన్ ప్రదర్శన ఏర్పాటు చేస్తే, ఆగస్టు 10న రాక్ బ్యాండ్ పనాహ్ సంగీత ప్రదర్శన ఉంటుందని, ఆగస్టు 11న సితార్ విద్వాంసుడు స్వయంసిద్ధ ప్రియదర్శి, ఓ డీజేల ఫ్యూజన్ మ్యూజిక్ ప్రదర్శన ఉంటుందని మాల్ ప్రతినిధులు వెల్లడించారు.

సామాజిక ఉద్యమ చైతన్యం పెంచేలా కవితా సంపుటి

రాయదుర్గం, ఆగస్టు9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర సాహిత్య అకాడమీ యువపురస్కార గ్రహీత పల్లిపట్టు నాగరాజు రచించిన 'యాలై పూడ్సింది' కవితా సంపుటిలో ఉందని హెచ్‌సీయూ తెలుగుశాఖ పూర్వ అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో డిగ్రీ కళాశాల విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న టాక్ ఆఫ్‌ది బుక్ కార్యక్రమంలో వీడియో కాల్ ద్వారా ప్రత్యేక ఉపన్యాసం చేశారు. విద్యార్థుల్లో సృజనాత్మకత శక్తి, సమకాలీన సాహిత్యం పట్ల అనురక్తి పెంపొందించడానికి టాక్ ద బుక్ కార్యక్రమం ఉపయోగపడుతుందని దార్ల అన్నారు. కార్యక్రమంలో ఏపీ ఉన్నత విద్యామండలి, అకాడమిక్ అధికారి శ్రీమ్యాత్యూ శ్రీరంగం వ్యవహరించారు.

విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి

హైదర్‌నగర్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): నిర్మాణంలో ఉన్న భవనంలో ఇసుక రవాణా చేస్తున్న కార్మికుడికి విద్యుత్ తీగలు తగిలి మృతి చెందాడు. ఈ సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవాం చోటుచేసుకుంది. ఎస్సై సుమన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌ఘడ్‌కు చెందిన తేజనాథ్‌పటేల్(26) కూకట్‌పల్లి బాలాజీనగర్‌లో భార్య సోంవిన్‌పటేల్‌తో కలిసి నివసిస్తూ భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తున్నాడు. కాగా శుక్రవారం తేజనాథ్ కేపీహెచ్‌బీ రోడ్‌నెంబర్-1లో భవన నిర్మాణంలో ఇసుక తరలించేందుకు మరో ఇద్దరితో కలిసి పనికి వెళ్లాడు. భవనంలోని 4వ అంతస్తులో ట్రాలీతో ఇసుక చేరవేస్తుండగా విద్యుత్‌షాక్ తగిలింది. గాయపడిన తేజనాథ్‌ను ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

● పోక్సో కేసులో నిందితుడికి జీవితఖైదు

బాలికపై అత్యాచారానికి పాల్పడిన ఓ వ్యక్తికి కూకట్‌పల్లి స్పెషల్ ఫాస్ట్‌ట్రాక్ కోర్టు జీవితఖైదు విధించింది. నిజామాబాద్ జిల్లా సాలంపాడు గ్రామానికి చెందిన కేసాని మురళీకృష్ణ(46) కూకట్‌పల్లి శంషీగూడకు చెందిన ఓ బాలికపై అత్యాచారానికి పాల్పడటంతో అతడిపై పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. కూకట్‌పల్లి స్పెషల్ ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో విచారణ చేపట్టారు. ఈ కేసులో శుక్రవారం న్యాయమూర్తి తీర్పును వెలువరించారు. నిందితుడికి జీవితకాలం ఖైదుతో పాటు రూ.5 వేల జరిమానా విధించారు. బాధితురాలికి రూ.5 లక్షల పరిహారం చెల్లించాలని కోర్టు ఆదేశించింది.

మద్యం మత్తులో స్నేహితుడికి కత్తిపోటు

● ప్రశ్నించిన స్నేహితుడి తల్లికీ కత్తిగాయాలు



వినోద్

కేపీహెచ్‌బీకాలనీ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో స్నేహితుడిపై కత్తితో దాడి చేసిన సంఘటన కూకట్‌పల్లిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కైత్లాపూర్ రాఘవేంద్ర కాలనీలో వినోద్ తన తల్లిదండ్రులతో ఉంటున్నారు. వీరి తల్లిదండ్రులు సొంతూరు వెళ్లడంతో స్నేహితులైన జగదీష్, సాయికుమార్‌లను మద్యం సేవించేందుకు ఆహ్వానించాడు. ఈనెల 9న ముగ్గురు మద్యం సేవిస్తున్న క్రమంలోనే మాటామాటా పెరిగి వినోద్, జగదీష్ కర్రలతో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. అక్కడి నుంచి తప్పించుకున్న జగదీష్ ఇంటికి వెళ్లి తన తల్లి పార్వతికి విషయం చెప్పాడు. దీంతో కొడుకుతో కలిసి రాత్రి 11.45 గంటల సమయంలో వినోద్ ఇంటికి చేరుకొన్నారు. తన కొడుకుని ఎందుకు కొట్టావని ప్రశ్నించింది. దీంతో వినోద్ వారిద్దర్నీ బూతులు తిడుతూ కత్తితో జగదీష్ కడుపులో పొడిచాడు. కుమారుడిని తప్పించే ప్రయత్నం చేస్తున్న ఆ తల్లిని కూడా కత్తితో గాయపర్చాడు. గాయపడిన ఇద్దరు చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి వెళ్లారు. బాధితురాలు పార్వతి ఫిర్యాదు మేరకు శుక్రవారం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువతితో అసభ్య ప్రవర్తన..

ఏఆర్ కానిస్టేబుల్‌పై కేసు నమోదు

కేపీహెచ్‌బీకాలనీ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఓ పోలీస్ కానిస్టేబుల్ యువతితో అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ సంఘటన కూకట్‌పల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కూకట్‌పల్లి వివేక్‌నగర్‌లో కుటుంబసభ్యుల దశదిన కార్యక్రమం కోసం గురువారం రాత్రి బాలానగర్ సీటీమ్‌లో డ్రైవర్‌గా పని చేస్తున్న ఏఆర్ కానిస్టేబుల్ నర్సింగరావు(35) హాజరయ్యాడు. కాళ్లు కడుక్కుంటుండగా అదే భవనంలో అద్దెకుంటున్న యువతి ఇక్కడ కాళ్లు కడగొద్దని అభ్యంతరం చెప్పింది. దీంతో కానిస్టేబుల్ ఆగ్రహిస్తూ 'నీవు ఏంటి చెప్పేది' అంటూ బూతులు తిడుతూ యువతిని ఎక్కడ పడితే అక్కడ తాకుతూ తోసేశాడు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ముత్తు తెలిపారు.

గచ్చిబౌలి డివిజన్‌లో వనమహోత్సవం

రాయదుర్గం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి డివిజన్ రాయదుర్గంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాల, గోపన్‌పల్లి తండా జీహెచ్ఎంసీ మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమంలో కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, జీహెచ్ఎంసీ అధికారులు పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని పిలుపునిచ్చారు. జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి మొక్కలు నాటుతున్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, విద్యార్థులు

భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి

ఫతేనగర్ జవహర్‌నగర్‌లోని కనక దుర్గ, శీతలాదేవి, కాళికా దేవి ఆలయంలో భక్తులు అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు



(జోన్‌బృందం, ఆంధ్రజ్యోతి)

నాగదేవత ఆలయంలో నాగుల పంచమి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే మహిళలు ఆలయాలకు అధిక సంఖ్యలో హాజరయ్యారు. పుట్టలో పాలు పోసి నాగమ్మతల్లి విగ్రహానికి పంచామృత అభిషేకాలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



బాలానగర్ సాయినాగేంద్ర ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు



శ్రావణ మాసం మొదటి శుక్రవారం సాయిబాబా ఆలయంలో భక్తుల రద్దీ



మూసాపేట సంతాన నాగదేవత ఆలయంలో పూజా కార్యక్రమాల్లో మూసాపేట మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ తదితరులు

● ప్రత్యేక అలంకరణ



కేపీహెచ్‌బీ మూడో రోడ్డులోని కామాక్షి సమేత ఏకాంబరేశ్వర స్వామి దేవస్థానంలో చైర్మన్ శ్రీరమణ ఆధ్వర్యంలో అమ్మవారిని గాజులతో అలంకరించారు. భక్తులు కుంకుమ పూజల్లో పాల్గొన్నారు.

గుండె జబ్బులపై అవగాహన

చిన్నారులచే 'నాన్హీ దిలో కా సఫర్'



కార్యక్రమంలో వైద్యులు, పిల్లలు, టి హబ్ ప్రముఖులు

రాయదుర్గం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): పుట్టకతో గుండె జబ్బులో బాధపడి, చికిత్సలతో కోలుకున్న చిన్నారులతో వినూత్న కార్యక్రమం నిర్వహించారు. గుండె జబ్బులు వస్తే.. బాధపడాల్సింది లేదని, సకాలంలో మెరుగైన చికిత్స పొందితే ముప్పు నుంచి తప్పించుకోవచ్చని ఆ చిన్నారులు నిరూపించారు. ఇలాంటి చిన్నారులతో కేర్ ఆస్పత్రుల సహకారంతో కోనెక్సస్, జగతి ఫౌండేషన్‌తో కలిసి పేద పిల్లల్లో పుట్టుకతో వచ్చే గుండె జబ్బులకు చికిత్స అందించడానికి 'నాన్హీ దిలో కా సఫర్' కార్యక్రమాన్ని శుక్రవారం గచ్చిబౌలిలోని టి హబ్‌లో నిర్వహించింది. ఈ సీఎస్ఆర్ క్యాంపెయిన్ 'నన్హే దిలో - కా సఫర్' ఒక హార్ట్ క్యాంప్‌తో ప్రారంభమైంది. ఇందులో 7 నుంచి 13 ఏళ్ల వయస్సు గల 11 మంది పిల్లలు 12 కళాత్మక కళాఖండాలను సృష్టించారు. పుట్టుకతో వచ్చే హృదయ వ్యాధులపై జరిగిన పోరాటంలో ఉత్తమ ఫలితాలను సాధించి, తమకూ ఉజ్వల భవిష్యత్ ఉందని ప్రదర్శించారు. ఈ సందర్భంగా సామాజిక కార్యక్రమం ప్రచార వీడియో విడుదల చేశారు. పిల్లలు, కళాకారులు రూపొందించిన పన్నెండు అద్భుతమైన కళాత్మక కళాఖండాలు, బొమ్మలను ప్రదర్శించారు. పుట్టుకతో వచ్చే గుండె జబ్బులతో బాధపడుతున్న పేద పిల్లలకు సహాయం చేయడానికి, వ్యాధి గురించి అవగాహన పెంచడానికి చేపట్టిన ఆరు నెలల సుదీర్ఘ ప్రయత్నానికి ఈ కార్యక్రమంతో ముగిసిందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేర్ ఆస్పత్రి గ్రూప్ సీఈఓ జస్దీప్‌సింగ్, టి హబ్ సీఈవో శ్రీనివాస్‌రావు మహంకాళి, కేర్ ఆస్పత్రి పీడియాట్రిక్ కార్డియోథొరాసిక్ సర్జరీ హెచ్ఓడి డాక్టర్ తపన్ కుమార్ దాష్, ఎన్జీవో భాగస్వాములు, వలంటీర్లు, పిల్లలు మరియు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

డ్రగ్ డిస్కవరీ డెలివరీ డయాగ్నస్టిక్స్ సదస్సు ఓ మైలురాయి

నైపర్ బీవోడి డా. సత్యనారాయణ చావా

బాలానగర్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): బాలానగర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మసూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (నైపర్)లో ఏర్పాటు చేసిన డ్రగ్ డిస్కవరీ డెలివరీ డయాగ్నస్టిక్స్ 2024 (ఐసీడి4-2024) కాన్ఫరెన్స్ ఫార్మా రంగంలో మైలురాయిగా నిలిచిపోతుందని నైపర్ హైదరాబాద్ బోర్డ్ ఆఫ్ గవర్నర్ డా.సత్యనారాయణ చావా అన్నారు. నైపర్ హైదరాబాద్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్స్, మినిస్ట్రీ ఆఫ్ కెమికల్స్ అండ్ ఫర్టిలైజర్స్ సంయుక్త ఆధ్వర్యంలో నైపర్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన బల్క్ డ్రగ్స్ మేనుఫ్యాక్చర్స్ అసోసియేషన్ (బీడీఎంఏఐ) జాతీయ అధ్యక్షుడు ఆర్.కే.అగర్వాల్, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ యానిమల్ బయోటెక్నాలజీ ఎన్ఐఏబీ డైరెక్టర్ జీ.తరుశర్మ, నైపర్ డైరెక్టర్ ప్రొ.శైలేంద్రసరాఫ్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కాన్ఫరెన్స్‌ను ప్రారంభించారు. అనంతరం సత్యనారాయణ మాట్లాడుతూ ఔషధ ఆవిష్కరణ ప్రక్రియ, వైద్య పరికరాలతో డ్రగ్ డెలివరీ పాత్ర గురించి చర్చించడానికి పరిశోధకులు, శాస్త్రవేత్తలు, పరిశ్రమల నిర్వాహకులు ఒకే వేదికపైకి రావడం ఫార్మా రంగానికి ఎంతో మేలు చేస్తుందన్నారు. ఎన్ఐఏబీ డైరెక్టర్ తరుశర్మ మాట్లాడుతూ ఫార్మా క్యాపిటల్ ఆఫ్ ఇండియాలో నైపర్ వ్యయాత్మక స్థానాన్ని సభకు వివరించారు. నైపర్, ఎన్ఐఏబీ మధ్య జంతు నమూనాలతో సహకార పరిశోధనల సంభావ్యతను తెలియజేశారు. అనంతరం నైపర్ డైరెక్టర్ శైలేంద్ర సరాఫ్ నైపర్ సాధించిన విజయాలను సభకు వివరించారు. శనివారం రెండో రోజుతో సదస్సు ముగుస్తుందని చెప్పారు. అనంతరం దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 200 మంది విద్యార్థులు, అధ్యాపకులు తమ తాజా పరిశోధనలపై మౌఖిక, పోస్టర్ ప్రదర్శనలను డా.సత్యనారాయణ చావ తదితరులు తిలకించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీన్ ప్రొ.నందూరి శ్రీనివాస్, రిజిస్ట్రార్ డా.అమిత్‌అస్థాన, సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీలు డా.పంకజ్‌కుమార్ సింగ్, డా.నీలేష్‌కుమార్ మెహ్రా పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభిస్తున్న డా. సత్యనారాయణ చావా

దేవుడి సామగ్రి బయట వేయొద్దు

పంజాగుట్ట, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): దేవుడి పాత విగ్రహాలు, పాత, చిరిగిపోయిన పుస్తకాలు, పూజా సామగ్రి, దేవుని చిత్రపటాలను ఎక్కడ పడితే అక్కడ వేయొద్దని, ఆర్య వైశ్య కమ్యూనిటీ ఇంటర్నేషనల్ ట్రస్ట్ కార్యదర్శి తులసీ సరాఫ్ తెలిపారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కోర్ కమిటీ సభ్యులు కిరణ్, పి.స్వాతిలతో కలిసి ఆమె వివరాలు వెల్లడించారు. ఇందుకోసం తొమ్మిది ఆలయాల వద్ద వాటి సేకరణ ఈనెల 11న ప్రారంభించనున్నట్లు వారు తెలిపారు. ఉప్పల్, కొత్తపేట, అంబర్‌పేట వెంకటరెడ్డినగర్‌లలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం, కొత్తపేట గాయత్రీపురంలోని గణపతి, ఉప్పల్ బీరప్పగడ్డలోని మహంకాళి ఆలయాలు, మలక్‌పేట దయానంద్‌నగర్‌లోని రామాలయం, మెట్టుగూడ అలుగడ్డబావిలోని హనుమాన్, సాయిబాబా ఆలయం, చింతల్ ప్రసూననగర్‌లోని కోదండ రామాలయం, సనత్‌నగర్ శివాజీనగర్‌లోని సెవన్‌టెంపుల్స్ వద్ద సేకరించనున్నట్టు తెలిపారు..

రైల్వేస్టేషన్ల నుంచి శివార్లకు బస్సులు

హైదరాబాద్‌సిటీ: రైల్వేస్టేషన్ నుంచి శివారు ప్రాంతాలకు బస్సులు పెంచేదిశగా గ్రేటర్ ఆర్టీసీ చర్యలు తీసుకుంటున్నది. కొత్తగా 83జె/272జీ రూట్‌లో కాచిగూడ రైల్వేస్టేషన్ నుంచి గండిమైసమ్మ వరకు శనివారం నుంచి 5 బస్సులను అందుబాటులోకి తెస్తున్నట్లు గ్రేటర్ ఆర్టీసీ జోన్ ఈడీ వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాచిగూడ రైల్వేస్టేషన్ నుంచి అబ్దుల్లాపూర్‌మెట్‌కు ఆర్టీసీ బస్సులను అందుబాటులోకి తెచ్చింది. రైల్వేస్టేషన్లలో దిగిన ప్రయాణికులు, విద్యార్థులు, ఉద్యోగులు ఆర్టీసీ బస్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు.

నాలుగు ప్రత్యేక రైళ్ల పొడిగింపు

సికింద్రాబాద్: ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని నాలుగు ప్రత్యేక రైళ్లను పొడిగిస్తున్నట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. సికింద్రాబాద్-రామనాథపురం స్పెషల్ (రైల్‌నంబర్: 07695)ను ఈనెల 21వ తేదీ నుంచి సెప్టెంబర్ 25వరకు (ప్రతి బుధవారం) పొడిగిస్తున్నారు. రామనాథపురం-సికింద్రాబాద్ స్పెషల్ (రైల్‌నంబర్: 07696)ను ఈనెల 23వ తేదీ నుంచి సెప్టెంబర్ 27 వరకు (ప్రతి శుక్రవారం), నర్సాపూర్-ఎస్ఎంవీటీ బెంగళూరు (రైల్ నంబర్: 07153)ను ఈనెల 16 నుంచి సెప్టెంబర్ 27 వరకు (ప్రతి శుక్రవారం), అలాగే ఎస్ఎంవీటీ బెంగళూరు-నర్సాపూర్ (రైల్‌నంబర్: 07154)ను ఈనెల 17 నుంచి సెప్టెంబర్ 28వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు తెలిపారు.

గ్రేటర్‌లో 345 డెంగీ కేసులు నమోదు

హైదరాబాద్‌సిటీ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వ్యాప్తంగా 345 డెంగీ కేసులు, ఒక మలేరియా కేసు నమోదయ్యాయి. ఈ మేరకు జిల్లా వైద్యారోగ్య, జీహెచ్ఎంసీ సంయుక్త పరిశీలన చేపట్టారు. 108 వార్డుల్లో 465 ప్రాంతాలను అధికారులు హాట్ స్పాట్‌లుగా గుర్తించారు. ఆగస్టు 15 వరకు వైద్యఆరోగ్య శిబిరాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఇప్పటి వరకు 175 వైద్యశిబిరాలు నిర్వహించగా.. 191 హాట్ స్పాట్‌లలో యాంటీలార్వా ఆపరేషన్స్, పైరత్రిన్ రసాయనాలు పిచికారి చేశారు. చెరువులు, మూసీ తీరంలోని 24 ప్రాంతాల్లో యాంటీ లార్వా ఆపరేషన్స్ చేపట్టారు. డెంగీపాజిటివ్ కేసు నమోదైన ఇళ్ల చుట్టూ మొత్తం 6,151 ఇళ్లలో స్ప్రే చేశారు. 13,721 ఇళ్లలో 118 పాఠశాలలు, 12 కళాశాలలో ఇండోర్ రెసిడ్యువల్ స్ప్రే చేశారు. 62 లోకేషన్లలో 365 ఆయిల్ బాల్స్ విడుదల చేయగా, 148 ఖాళీ స్థలాల్లో గంబుజియా చేపలు విడుదల చేశారు.

గ్రామోద్యోగ్ వికాస్ యోజన పథకానికి దరఖాస్తుల స్వీకరణ

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): గ్రామోద్యోగ్ వికాస్ యోజన (జీవీవై) పథకం కింద శిక్షణ, సాధనాల కోసం అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 సంవత్సరానికి గాను జీవీవై స్కీమ్ కింద అగర్‌బత్తి తయారీ, పేపర్‌పేట్ల తయారీ, పేపర్ మార్చిడి, మనీ ఆయిల్ తయారీ, టర్న్‌వుడ్, ప్లంబర్, ఎలక్ట్రీషియన్, మొబైల్ రిపేరింగ్, కుట్టు యంత్రాలు, లెదర్/పాదరక్షలు, చేతివృత్తుల వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తునట్లు తెలిపారు. ఆగస్టు 20-2024 వరకు http://www.kvic.gov.in// ద్వారా దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

నిమ్స్‌ను సందర్శించిన తమిళనాడు హెల్త్ సెక్రటరీ

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): నిమ్స్‌ను తమిళనాడు హెల్త్ సెక్రటరీ సుప్రియ సాహు శుక్రవారం సందర్శించారు. ఆస్పత్రిలోని పలు విభాగాలను సందర్శించి ఇక్కడ అందుతున్న సేవలను డైరెక్టర్ నగరి భీరప్పను అడిగి తెలుసుకున్నారు. డయాలసిస్ విభాగంలో టెలి డయాలసిస్ విధానం ద్వారా దూర ప్రాంత గ్రామీణ కిడ్నీ రోగులకు డాక్టర్ల పర్యవేక్షణాలో అందుతున్న సేవల గురించి డాక్టర్ గంగాధర్ వివరించారు. తరువాత వెల్‌నెస్ సెంటర్‌లో సివిల్ సర్వంట్స్‌కు అందిస్తున్న సేవల గురించి భీరప్ప తెలిపారు. తర్వాత తదుపరి డీఎస్ఏ ల్యాబ్‌ను సందర్శించి అన్ని వర్గాల వారికీ అందుతున్న సేవలకు సంతృప్తిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ హెల్త్ ఫ్యామిలీ వెల్ఫేర్ నుంచి ఆర్. వి. కర్ణన్, ప్రొఫెసర్ రామ్ మూర్తి, ప్రొఫెసర్ స్వర్ణలత, సీనియర్ వైద్యులు పాల్గొన్నారు.

నేడు రాష్ట్ర బీజేపీ కార్యాలయానికి బండి సంజయ్ రాక

హైదరాబాద్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ శనివారం పార్టీ రాష్ట్ర కార్యాలయానికి రానున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆయన పార్టీ నాయకులకు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటారు. సాయంత్రం స్థానికంగా వివిధ ప్రైవేటు కార్యక్రమాలకు హాజరవుతారు. ఆదివారం కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభిస్తారని పార్టీవర్గాలు తెలిపాయి.

భరత్‌నగర్‌లో నిర్మాణంలో ఉన్న భవనం సీజ్



సీజ్ చేసిన భవనం

ఫతేనగర్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ఫతేనగర్ డివిజన్ భరత్‌నగర్ కాలనీలో నాలా బఫర్ జోన్‌లో నిర్మించిన ఓ భవనాన్ని శుక్రవారం సీజ్ చేశారు. భరత్‌నగర్‌లో ఇంటినెంబర్ 12-10-92/2/2/1 గల భవనము నాలా బఫర్ జోన్‌లో ఉన్నట్లు గుర్తించిన జీహెచ్ఎంసీ అధికారులు సెక్షన్ 461-ఎ ఆఫ్ జీహెచ్ఎంసీ 1955 ప్రకారం సీజ్ చేసినట్లు తెలిపారు.

సాంకేతికతతో పరిశోధనలు కొంత పుంతలు

నిజాంపేట్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): సాంకేతిక పురోగతి ద్వారా పరిశోధనలు కొంత పుంతలు తొక్కడంలో కృత్రిమ మేధ మెషిన్ లెర్నింగ్‌లదే సింహభాగం అని, వీటివలన భవిష్యత్‌లో సాంకేతిక ఆవిష్కరణలకు కొత్త సవాళ్లు వస్తున్నాయని, గ్రీస్‌లోని పిరేయస్ విశ్వవిద్యాలయ ఆచార్య డాక్టర్ జార్జి ఏ.షిక్రిన్టస్ అన్నారు. శుక్రవారం బాచుపల్లిలోని వీఎన్ఆర్ వీజేఐఈటీలో అడ్వాన్స్ ఇన్ కంప్యూటర్ ఇంజనీరింగ్ అండ్ కమ్యూనికేషన్స్ సిస్టమ్స్ 2024పేరిట అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న షిక్రిన్టస్ మాట్లాడుతూ సాంకేతిక ఆవిష్కరణలకు కొత్త సవాళ్లు కూడా భవిష్యత్‌లో వస్తాయని గుర్తుచేశారు. అనంతరం జేఎన్‌టీయూ హైదరాబాద్‌కు చెందిన ప్రొఫెసర్ ఆచార్య డాక్టర్ ఏ.గోవర్ధన్, బల్గేరియాకు చెందిన డాక్టర్ రొమ్‌మియానా కాంచ్వవా, టీసీఎస్ ఎకి చెందని బాలప్రసాద్ మాట్లాడారు. ఈ సదస్సులో డాక్టర్ నితిన్ నాయక్, డాక్టర్ పవన్‌జైన్, డాక్టర్ గణేష్ తొట్టెంపూడి, విజన్ ల్యాంగ్వేజ్ మోడల్స్, బ్లాక్ చైంజ్ సమాజానికి కృత్రిమ మేధ సహకారం అన్న అంశాలపై కీలక ఉపన్యాసాలు చేశారు.

ముగిసిన 'స్వచ్ఛదనం- పచ్చదనం'



హైదర్‌నగర్ డివిజన్ అంబీర్‌చెరువు వద్ద మొక్క నాటుతున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, ఉపకమిషనర్ కృష్ణయ్య, అసిస్టెంట్ కమిషనర్ శ్రీవాత్సవ్



హైదర్‌నగర్ కూకట్‌పల్లి నల్లచెరువు దగ్గర మొక్క నాటుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

(జోన్‌బృందం, ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జీహెచ్ఎంసీ వెస్ట్‌జోన్ పరిధిలోని అన్ని సర్కిళ్లలో స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమం శుక్రవారంతో ముగిసిందని కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావడంతో విజయవంతమైందని జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి అన్నారు. ఐదు రోజుల్లో పారిశుధ్య పనుల నిర్వహణలో భాగంగా 199 కాలనీలను సందర్శించి చెత్త, వ్యర్థాలు తొలగించినట్లు తెలిపారు. కాలనీలో పేరుకుపోయిన చెత్తతో పాటు వ్యర్థాలు, రోడ్డుపక్కన పొదలు తొలగించి పరిసరాలను శుభ్రపరిచినట్లు వివరించారు. పారిశుధ్యంపై కాలనీల్లో ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. జోన్ పరిధిలో 40 శ్మశానవాటికలను శుభ్రం చేసిన ట్లు వివరించారు. ఆయా సర్కిళ్లలో చెరువులు, కుంటలు, కాల్వల పూడికతీత, వ్యర్థాలు తొలగించామని పేర్కొన్నారు. చెరువునీటిలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించి తరలించామన్నారు. ఐదు రోజులు జరిగిన కార్యక్రమాలను జీహెచ్ఎంసీ కమిషనర్‌కు వివరిస్తామని తెలిపారు.